
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

శుక్రవారం 24 మే 2024



పకడ్బందీగా కౌంటింగ్ నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, మే 23: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన నాలుగు నియోజకవర్గాల కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు మొదటివిడత శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లను మెదక్ పార్లమెంట్ పరిధిలోని నర్సాపూర్ బీవీఆర్ ఐటీ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో, హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్లను కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఎస్ఆర్ కళాశాలలో లెక్కిస్తారని తెలిపారు. జిల్లాలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 79 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లను 80 మందిని నియమించినట్లు తెలిపారు. మిషన్లలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా సూపర్‌వైజర్లు నియోజకవర్గ ఏఆర్‌వోను మాత్రమే సంప్రదించాలని ఆమె సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణలో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని, ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా మాస్టర్ ట్రైనర్ అధికారి అయోధ్యరెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియ వివరించారు. కార్యక్రమంలో సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, జిల్లా ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్, డీపీవో దేవకీదేవి, జిల్లా మాస్టర్ ట్రైనర్స్, పలువురు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజనపై

రైతులకు అవగాహన కల్పించాలి

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

7లో

చేపా.. చేపా ఎక్కడున్నవ్



- జిల్లాలో చేపపిల్లల పంపిణీపై నీలినీడలు!
- ఇంకా మొదలు కాని టెండర్ల ప్రక్రియ
- ఎన్నికల కోడ్‌తో తంటాలు
- ఆలస్యమైతే ఎదుగుదల కష్టమే!
- ఆందోళనలో మత్స్యకారులు



గజ్వేల్, మే 22: చేపపిల్లల పంపిణీపై నీలినీడలు అలుముకున్నాయి. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. గత ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఇప్పటి వరకు చేపపిల్లల పంపిణీపై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉండడం, రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం.. ఏ పని చేయాలన్నా ఎలక్షన్ కమిషన్ అనుమతి తీసుకోవాల్సి ఉండడంతో ఈ విషయంపై కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోనట్లు తెలుస్తున్నది. అయితే, చేపల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వస్తుందా? లేదా? అన్న మీ మాంస సగటు మత్స్యకారుల్లో నెలకొన్నది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

సిద్దిపేట జిల్లాలో 26 మండలాల పరిధిలో 369 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో 24,600మంది మత్స్యకారులు ఉన్నారు. జిల్లాలోని రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లతో పాటు చెరువులు, కుంటల్లో బొచ్చ, రవ్వ, బంగారు తీగలు, కొరమీను చేపపిల్లలను వదిలేవారు. గతేడాది 1,637 చెరువులు, కుంటల్లో జిల్లా వ్యాప్తంగా 4.28 కోట్ల చేప పిల్లలను వదిలారు. ప్రతిసారి ఏప్రిల్, మే లోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి వర్షాలు కురిసిన వెంటనే ఆగస్టు, సెప్టెంబర్‌లో చేపపిల్లలను వందశాతం సబ్సిడీపై మత్స్యకారులకు అందజేసేవారు. ఈ ఏడాది మే పూర్తికావస్తున్నా చేప పిల్లల పంపిణీపై ఎలాంటి ఆదేశాలూ రాకపోవడంతో మత్స్యకారుల్లో గందరగోళం నెలకొన్నది. ఆలస్యం చేస్తే చేపల ఎదుగుదలలో సైతం నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని మత్స్యకారులు వాపోతున్నారు.

తక్షణమే టెండర్లు నిర్వహించాలి

- కొట్టాల యాదగిరి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు

ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీకి చర్యలు చేపట్టాలి. తక్షణమే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి మత్స్యకారుల్లో నెలకొన్న సందిగ్ధతను తొలగించాలి. మత్స్యకారుల సంపద పెంపుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలి. ఇప్పటికే ఆలస్యమైన నేపథ్యంలో ప్రభుత్వం చేప పిల్లల పంపిణీపై వెంటనే ఈసీ అనుమతితో టెండర్లను నిర్వహించాలి.

జీవాలపై హైనా దాడి.. 65 గొర్రెలు మృతి

- 20 జీవాలకు తీవ్ర గాయాలు
- చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో ఘటన
- రైతులు అప్రమత్తంగా ఉండాలి : అధికారులు



హైనా దాడిలో మృతి చెందిన జీవాలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

చిన్నకోడూరు, మే 23 : జీవాల (గొర్రెలు, మేకల) మందపై హైనా దాడి చేయడంతో 65 గొర్రెలు మృతి చెందగా, 20 జీవాలకు తీవ్ర గాయాలైన సంఘటన చిన్నకోడూరు మండలం మాచాపూర్‌లో గురువారం జరిగింది. మాచాపూర్ గ్రామానికి చెందిన రైతు పున్నం మల్లయ్య తన వ్యవసాయ బావి వద్ద జీవాల మంద కోసం ఇనుప జాలితో ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశాడు. మల్లయ్య రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం వరకు జీవాలను మేత మేపి ఫెన్సింగ్‌లోనికి తోలి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున బావి దగ్గరికి వచ్చిన మల్లయ్య గొర్రెలు, మేకలు కలిపి 65 మృతి చెంది, 20 జీవాలకు తీవ్ర గాయాలై ఉండటాన్ని గమనించాడు. జీవనాధారమైన జీవాలు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇక్రమొద్దీన్, సెక్షన్ ఆఫీసర్ బుచ్చయ్య, బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టూ పక్కల దాడి చేసిన జంతువు పాదముద్రలను సేకరించి జీవాలపై దాడి చేసింది హైనాగా గుర్తించారు. రాత్రి వేళలో ఘటన స్థలంలో ట్రాప్ కెమెరాలతో పాటు, బోను ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పశువైద్యాధికారిణి మంజుల సిబ్బందితో కలిసి తీవ్ర గాయాలైన జీవాలకు చికిత్స అందించారు. మృతి చెందిన జీవాల విలువ సుమారు రూ. 5.50 లక్షలు ఉంటుందని ఆమె తెలిపారు. ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాబు, ఉప సర్పంచ్ సురేష్, నాయకులు ఎల్లయ్య, రాజిరెడ్డి, రాజారెడ్డి మృతి చెందిన జీవాలను పరిశీలించారు.



అధికారులు గుర్తించిన హైనా పాదముద్ర

అక్రమ వెంచర్లపై అధికారుల కొరడా

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దిపేట అర్బన్, మే 23 : ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 23న ప్రచురితమైన 'అంతా మా ఇష్టం', 'రియల్టర్ల ఇష్టారాజ్యం' కథనంపై అధికారు లు స్పందించి అక్రమ వెంచర్లపై కొరడా ఝుళిపించారు. సిద్దిపేటఅర్బన్ మండలం కిష్టసాగర్ పొన్నాల గ్రామపంచాయతీ సమీపంలోని రెండు అక్రమ వెంచర్లను పూర్తిగా తొలగించారు. అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్స్ విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేని వెంచర్లు తమ దృష్టికి వస్తే తొలగిస్తామని చెప్పారు. నియమ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా వెంచర్ యజమానులు అనుమతులు తీసుకోవాలని అధికారులు సూచించారు.



కిష్టసాగర్ సమీపంలోని వెంచర్‌ను తొలగిస్తున్న సిబ్బంది



పొన్నాల నుంచి కిష్టసాగర్ వెళ్లే గ్రామంలో అక్రమ వెంచర్‌లోని హద్దురాళ్లను తొలగిస్తున్న సిబ్బంది



ఎల్లమ్మదేవి కల్యాణానికి హాజరైన భక్తులు

వైభవంగా రేణుకా ఎల్లమ్మ జాతర

- బోనాలు, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్న భక్తులు
- ఆకట్టుకున్న పంబాల పూజారుల ప్రదర్శన

హుస్నాబాద్, మే 23 : హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతర గురువారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. ఈ జాతరను తెల్లవారుజామునే సిద్దోగంతో ప్రారంభించారు. ఎల్లమ్మదేవిని స్తుతిస్తూ ఆమె చరిత్రను పంబాల పూజారులు ఆటపాటల ద్వారా వివరించారు. అనంతరం ఎల్లమ్మ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అమ్మవారికి అధికారికంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారికి బోనం, చీరలు, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. హుస్నాబాద్ పట్టణ వాసులే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, అరుణ దంపతులు అమ్మవారికి రూ.లక్ష విలువైన బంగారు మంగళసూత్రాలు సమర్పించారు. వేడుకల్లో ఆలయ ఈవో పి.కిషన్‌రావు, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, ఆలయ కమిటీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, పున్న లావణ్య, పెరుక భాగ్యరెడ్డి, చిత్తారి పద్మ, దొడ్డి శ్రీనివాస్ వాల సుప్రజ, బోజు రమాదేవి, జనగామ రత్నమాల, గూళ్ళ రాజు,వల్లపు రాజు, శ్రీను, వేణు, సరోజన, ఎండి అయూబ్, ఆలయ కమిటీ సభ్యులు జగదీశ్వర్, పరమేశ్వర్, బత్తిని లక్ష్మయ్య, రాజయ్య, వీరయ్య తదితరులున్నారు.



ఎల్లమ్మ కథను చెబుతున్న పంబాల పూజారులు



నీరు లేక వెలవెలబోయిన రంగనాయకసాగర్

అడుగంటిన

సాగరాలు

మొన్నటి వరకు జలకళతో కళకళలాడిన సాగరాలు నేడు ఒట్టిపోయాయి. కాళేశ్వరం నుంచి పంపింగ్ నిలిచిపోవడంతో నీరు లేక ఇలా వెలవెలబోతున్నాయి. దీంతో పర్యాటకులు నిరాశ చెందుతున్నారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)



దిబ్బలా మారిన కొండపోచమ్మ రిజర్వాయర్



కుకునూరుపల్లి మండలం మేదినీపూర్‌లోని పెద్దమ్మ ఆలయం

నిందితులను పట్టుకోరా?

- ఆలయాల్లో వరుస దొంగతనాలు
- చైన్ స్నాచింగ్‌కు విఫలయత్నాలు
- వ్యవసాయ సామగ్రిని సైతం వదలని దొంగలు
- నెలల నుంచి కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు
- భయపెడుతున్న వరుస దొంగతనాలు

7లో

వైద్యం వికటించి బాలింత మృతి

8

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబసభ్యుల ఆరోపణ
- ఆసుపత్రి ఎదుట ఆందోళన

ముడుపు చెల్లించుకున్న హరీశ్‌రావు

మల్యాల, మే 23: సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు కొండగట్టు అంజనేయస్వామికి ముడుపు చెల్లించుకున్నారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు తన విజయం కోసం అంజన్న సన్నిధిలో ముడుపు కట్టిన హరీశ్‌రావు బుధవారం రాత్రి కొండపైకి చేరుకొని బస చేశారు. గురువారం స్వామి వారి సన్నిధానంలో పూజలు నిర్వహించి ముడుపు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పలువురు ఉన్నారు.



కొండగట్టులో పూజలు చేస్తున్న హరీశ్‌రావు



ఆవాలతో బుద్ధుడు

బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఆవాలతో బుద్ధుడి చిత్రాన్ని తీర్చిదిద్దారు.

- గజ్వేల్, మే 23

మట్టే.. కొల్లగొట్టే

- రైతుల అవసరాల పేరుతో చెరువులను తవ్వేస్తున్నారు
- ఖాళీ స్థలాలు, లేఅవుట్లుకు మట్టి తరలింపు



అంక్షాపూర్ నబీ చెరువులోని మట్టిని తోడి ట్రాక్టర్‌లో నింపుతున్న ఎక్స్‌కవేటర్

నంగునూరు, మే 23 : రైతుల అవసరాల సాకుతో అనుమతి లేకుండానే విచ్చలవిడిగా మట్టి దందా నడుస్తుంది. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువులు, ప్రభుత్వ భూముల్లో మట్టిని కొల్లగొడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తూ కొందరు అక్రమార్కులు కాసులు పోగేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరించడంతో మట్టి వ్యాపారుల ఆగడాలు మితిమీరుతున్నాయి.

నంగునూరు మండల పరిధిలోని మగ్దంపూర్‌లో ఊరచెరువు, అంక్షాపూర్ గ్రామంలోని నబీచెరువును ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లల్లో ఖాళీ స్థలాలు, లేఅవుట్లకు మట్టిని తరలిస్తూ ఒక్కో ట్రిప్పునకు వెయ్యి నుంచి రెండు వేల వరకు వసూలు చేస్తున్నారు. అనుమతి లేకుండా చెరువులో నుంచి మట్టిని తరలించొద్దని, ఒకవేళ తరలిస్తే వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిసినప్పటికీ వ్యాపారులు లెక్కచేయడం లేదు. నంగునూరు చౌడుచెరువు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువు చుట్టూ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ విషయం పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చించి చెరువులకు మరమ్మతులు చేపట్టారు. గతేడాది నిండుకుండలాగా చెరువులు దర్శనమిచ్చాయి. ఈసారి కరువు ఏర్పడడంతో చెరువులో నీటి శాతం తగ్గింది. ఇదే అదనుగా మట్టి వ్యాపారులు రంగంలోకి దిగి విచ్చలవిడిగా ఎక్స్‌కవేటర్లతో పెద్ద పెద్ద గోతులు తీస్తూ మట్టిని తరలిస్తున్నారు. రైతులకు ఉపయోగపడే చెరువు నుంచి మట్టి తరలించవద్దని ఆయా గ్రామస్థులు అడ్డు చెప్పినా లెక్కచేయకుండా తోడేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

నంగునూరు మండలంలో చెరువు, కుంటల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టితరలిస్తే కఠిన చర్యలు చేపడతాం. చెరువుల్లో మట్టిని కొల్లగొట్టే ప్రయత్నం చేస్తే కేసులు నమోదు చేస్తాం. మగ్దంపూర్, అంక్షాపూర్ గ్రామాల్లో మట్టి తరలిస్తున్న విషయం మా దృష్టికి రాగానే వెంటనే నిలిపివేయించాం. మట్టి తరలిస్తున్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

- రాజు, ఇరిగేషన్ ఏఈ



మగ్దంపూర్ ఊర చెరువులో తోడుతున్న మట్టి

గాలివాన బీభత్సం

- ఎగిరిపోయిన ఇంటిపైకప్పు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం



కుర్తివాడ వద్ద ప్రధాన రహదారిపై విరిగిపడిన కరెంటు స్తంభం

పాపన్నపేట, మే 23 : మండలంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. లక్ష్మీనగర్, యూసుఫ్‌పేట, కుర్తివాడ, మిన్‌పూర్ శివారులో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేల కూలగా రాత్రి వరకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపడగా వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. అన్నారం గ్రామంలో సత్యనారాయణ ఇంటి పైకప్పులు లేచిపోయి ఊడిపడ్డాయి. ఇదే గ్రామంలో మరో ఇంటిపై కరెంటు స్తంభం విరిగిపడింది. స్థానికులు, సిబ్బంది వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. కుర్తివాడ గేటు వద్ద మెదక్-బోడుమెట్పల్లి రహదారిపై చెట్లు కూలిపోయి రాకపోకలకు ఇబ్బంది కలిగింది. కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. కూలిన స్తంభాలు, చెట్లను తొలగించే పనిలో విద్యుత్ సిబ్బంది నిమగ్నమయ్యారు.



యూసుఫ్‌పేటలో కూలిన పౌల్ట్రీఫాం గోడ, చెల్లాచెదురైన రేకులు



పాపన్నపేటలో రోడ్డుపై పడిన చెట్లను తొలగిస్తున్న విద్యుత్ అధికారులు

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- సంగారెడ్డి జిల్లాలో పది, మెదక్ జిల్లాలో 4 పరీక్షా కేంద్రాలు
- సంగారెడ్డిలో హాజరుకానున్న 3,205 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి నిరాకరణ

సంగారెడ్డి అర్బన్, మే 23 : మెదక్, సంగారెడ్డి జిల్లాలో నేడు పాలిసెట్‌ను నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరగనున్నది. విద్యార్థులను 10 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 11 గంటల తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుతించరు. సంగారెడ్డి పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 2,420 మంది, జహీరాబాద్ లోని మూడు కేంద్రాల్లో 785 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లోని మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకుని పాస్‌పోర్ట్ సైజు ఫోటో అతికించుకొని గజిటెడ్ అధికారి సంతకంతో కేంద్రాల్లోకి రావాలని అధికారులు సూచించారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలని, పరీక్షకు మధ్యలో టాయిలెట్‌కు కూడా అనుమతి ఉండదని సంగారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జహీరాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి స్పష్టం చేశారు.



సంగారెడ్డి పట్టణంలోని ఎస్‌వీ జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది



మెదక్ పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లను వేస్తున్న అధికారులు

మెదక్‌లో హాజరుకానున్న 1,590 మంది విద్యార్థులు

మెదక్ అర్బన్: పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మెదక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత తెలిపారు. శుక్రవారం జరుగనున్న పరీక్ష నిర్వహణకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 4 కేంద్రాల్లో 1,590 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంట వరకు ఉంటుందన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు.





తూప్రాన్ నలంద కాలేజీలో పరీక్షల నిర్వహణపై సమావేశం, పెద్దశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న దృశ్యం

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జూన్ 3 వరకు నిర్వహణ
- మెదక్ జిల్లాలో 22 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 6,110 మంది విద్యార్థులు

మెదక్ అర్బన్, మే 23: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3 వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 గంటల మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల కోసం మెదక్ జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 3,812 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,298 మంది మొత్తం 6,110 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. 22 మంది సీఎస్, 22 డీవోలతోపాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, 4 సిట్టింగ్ స్క్వాడ్, 4 కస్టడీయన్ బృందాలను నియమించామన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ప్రైవేటు కళాశాలలు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ హెచ్చరించారు. పరీక్షలకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కంట్రోల్ రూం నంబర్లు 9603615652, 76710333232 సంప్రదించాలని సూచించారు.

సంగారెడ్డి జిల్లాలో 31 పరీక్షా కేంద్రాలు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో ఫస్టియర్ 9,318 మంది, ఒకేషనల్ 599 మంది, సెకండియర్‌లో 4,646 మంది, ఒకేషనల్ 323 మంది మొత్తం 14,886 మంది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందు కోసం జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉండనుంది. విద్యార్థులు సంబంధిత వెబ్ సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది. వాటిపై కళాశాల ప్రిన్సిపాల్ సంతంకం లేకున్నా అనుమతిస్తారు. పరీక్షకు గంట ముందుగా విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తమ వెంట తీసుకురాకూడదని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల పర్యవేక్షణకు జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ బృందాలను నియమించారు. పరీక్ష కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంచనున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నాపత్రం తెరుస్తారు. కాగా పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారులు గురువారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు.

కళ్లల్లో కారం చల్లి వ్యక్తి కిడ్నాప్

- సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో ఘటన



వెంకటేశం (ఫైల్)

కల్హేర్, మే 23: సినీ ఫక్కీలో కళ్లల్లో కారం చల్లి ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కల్హేర్‌లో జరిగింది. ప్రత్యక్ష సాక్షి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన మల్లొడ్డి వెంకటేశం పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేసి, ఉద్యోగం నుంచి తొలిగించబడ్డాడు. అనంతరం స్వంత గ్రామం క్రిష్ణాపూర్‌లోనే ఉంటున్నాడు. గురువారం గ్రామానికి చెందిన ఎడ్ల ఆనంద్ అనే వ్యక్తితో కలసి కల్హేర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి భూ సంబంధిత వివరాలు తీసుకున్నాడు. ఆ సమయంలో కార్యాలయ ఆవరణలో ఉన్న వెంకటేశం వద్దకు ఒక మహిళతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి మాట్లాడాలని చెప్పి వారితో పాటు తీసుకెళ్లారు. వెంకటేశం, ఆనందర్ ద్విచక్ర వాహనంపై కల్హేర్‌కు సమీపంలోని నల్లవాగు మహారాజ్ బ్రిడ్జి వద్దకు వెళ్లగానే కామారెడ్డి జిల్లా పిట్లం వైపు నుంచి తూఫాన్ వాహనంలో ఆరేడుగురు వ్యక్తులు వచ్చి వెంకటేశం కళ్లల్లో కారం చల్లి దాడి చేశారు. ఆయన వెంట ఉన్న ఆనంద్‌ను ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించారు. అనంతరం అదే వాహనంలో వెంకటేశంను కిడ్నాప్ చేశారు. ఈ విషయాన్ని ఆనంద్ క్రిష్ణాపూర్ గ్రామస్థులకు తెలుపగా.. వారు కల్హేర్ పోలీసులకు పమాచారం అందించారు. కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం కిడ్నాప్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డికి సమాచారమందించడంతో ఆయన కూడా కల్హేర్‌కు చేరుకున్నారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో 161వ జాతీయ రహదారి సీసీ కెమెరాలను పరిశీలించారు. కిడ్నాపర్ల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా కిడ్నాప్ అయిన వెంకటేశం అక్క, ఆమె కొడుకు ఈ కిడ్నాప్‌లో పాలుపంచుకున్నట్లు తెలిసింది. ఇది వరకు వారి మధ్య గొడవలు జరగడం, పోలీసుల సమక్షంలో పంచాయితీలు జరిగినట్లు తెలిసింది. ఆస్తి తగాదాలు కూడా ఉండడంతో ఆ కోణంలోనే వెంకటేశంను భయపెట్టడానికి కిడ్నాప్ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

డీడీల వాపసుకు దరఖాస్తు చేసుకోవాలి

మద్దూరు, మే 23: రెండో విడతలో గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన వారు విత్ డ్రా కోసం దరఖాస్తులు చేసుకోవాలని గురువారం మండల పశువైద్యాధికారి హరికిషన్ తెలిపారు. మండలంలో 318 మంది రెండో విడతలో గొర్రెల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. డబ్బులు చెల్లించి యూనిట్ రాని వారి నుంచి డీడీ విత్‌డ్రా కోసం దరఖాస్తులు తీసుకుని కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తున్నట్లు తెలిపారు. విత్‌డ్రా కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రెండు వారాల్లోపు వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని తెలిపారు. ఇందుకోసం దరఖాస్తు ఫారం నింపి దానికి ఆధార్ కార్డు, బ్యాంకు పాసుబుక్కు జిరాక్స్ జత చేసి పశువైద్యశాలలో అందజేయాలని సూచించారు. డీడీలు వెనక్కి తీసుకుంటే మళ్లీ గొర్రెల యూనిట్లు వస్తాయో లేదోనన్న ఆందోళన అవసరం లేదని, మళ్లీ గొర్రెల పంపిణీ ప్రారంభిస్తే డీడీలు వెనెక్కి తీసుకున్న వాళ్లకు కూడా గొర్రెలు వస్తాయని తెలిపారు. డీడీలు వెనక్కి తీసుకున్న వారు మరోసారి డీడీలు తీయాల్సి ఉంటుందన్నారు.

ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్



ఆస్పత్రి సిబ్బందితో సమావేశమైన డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

జోగిపేట, మే23: జోగిపేటలోని ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త (డీసీహెచ్ఎస్) సంగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులూ తిరిగి, వసతులను పరిశీలించారు. రోగులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎండలు మండుతుండడంతో పపాటు అకాల వర్షాల నేపథ్యంలో తరచూ విద్యుతు సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ఆసుపత్రిలో ఉన్న జనరేటర్‌ను పరిశీలించారు. అది పనిచేస్తుందా లేదా అన్న విషయాన్ని సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని, ఆసుపత్రిలో రోగులకు సౌకర్యాలను కల్పించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ రమేశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

మాచాపూర్ ఎల్లమ్మ ఆలయంలో చోరీ

చిన్నకోడూరు, మే 23: చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో దుండగులు బుధవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. గౌడ సంఘం సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్లపల్లి స్వరూప రోజు మాదిరిగానే గురువారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసి పూజ చేయడానికి వెళ్లింది. ఆలయం తలుపులు తెరచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా అమ్మవారి పుస్తెమట్టెలు, ముక్కు పుడక కనిపించలేదు. హుండీ తాళం పగులగొట్టి హుండీలో ఉన్న సుమారు రూ.10 వేలు దుండగులు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఇటీవలే ఆలయ వార్షికోత్సవాలు జరిగాయని వారు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

దొంగతనం కేసులో జైలు, జరిమానా

సిద్దిపేట రూరల్, మే 23: దొంగతనం కేసులో ముగ్గురు నిందితులకు సిద్దిపేట కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి చందన ఆరు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు రూరల్ ఎస్‌ఐ అపూర్వ రెడ్డి గురువారం తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో 2015లో పొలం పనులు చేసుకుంటున్న అచ్చిని కవిత, ఛత్రి మల్లవ్వ మెడలోని 3.5తులాల బంగారు పుస్తెల తాడు, తులం బంగారు గుండ్లను రేషం జ్ఞానేశ్వర్, గొడుగు శ్రవణ్, ఎర్ర నగేశ్ లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ క్రమంలోనే నిందితులకు న్యాయాధికారి జైలు శిక్ష, జరిమానా విధించారు.

ఫసల్ బీమా యోజనపై అవగాహన కల్పించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో రైతులు, వ్యవసాయాధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 23: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), పంట బీమా రైతులకు అందాలంటే ఎలాంటి పంటలు పండించాలో గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో గురువారం రైతులు, వ్యవసాయాధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పంట బీమా రైతులకు అందాలంటే వారు ఏ పంట పండిస్తున్నారనే వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. బీమా యోజన ప్రయోజనాలు రైతులు పొందేలా ఏఈవోలు రైతులను సమన్వయపర్చాలని ఆదేశించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగినప్పుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు పంటల బీమా పథకం, ఫసల్ బీమా యోజన ఎంతగానే ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ పథకాలను త్వరలో ప్రారంభమయ్యే వానాకాలం పంటల నుంచి రైతులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. యూనివర్సల్ కవరేజ్, ఎంపిక చేసిన ప్రాంతాల్లోని పంటలకు బీమా పథకం వర్తింపచేయడం, రైతులకు ఉచిత, రైతుల ప్రీమియం, వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో మాస్టర్ ట్రైనర్ ద్వారా వివిధ అంశాలపై వ్యవసాయ శాఖాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన జిల్లా వ్యవసాయ శాఖాధికారులు జేడి నర్సింహారావు, శివప్రసాద్, గోవింద్, సీపీవోలు బాలశౌరి, చంద్రశేఖర్‌ఖ, రాజు, మాన్య, ఉద్యానవనశాఖ అధికారులు సోమేశ్వర్‌రావు, నర్సయ్య, ఏవో ఏవిజీకే ప్రసాద్, ఆదర్శ రైతులు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతను చాటేందుకు యువకుల సైకిల్ యాత్ర



సైకిల్ యాత్రలో వెంకటేష్, భానుప్రసాద్

మాసాయిపేట, మే 23: దేశ సమైక్యత, సమగ్రతను చాటి చెప్పడానికి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలానికి చెందిన వెంకటేష్, కర్ణాటకకు చెందిన భానుప్రసాద్ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. గురువారం 44వ జాతీయ రహదారిపై రామంతాపూర్ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. యువతను చైతన్యం చేస్తూ, దేశ సమైక్యతను చాటి చెబుతూ, నూతన ప్రదేశాలను, వ్యక్తులను కలుస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం, పాలకుల దృష్టికి తేవడానికి యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. యువతను చైతన్యం చేయడానికి 3,000 కిలోమీటర్ల మేర నెల రోజుల పాటు అయోధ్య లడక్ వరకు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

- చీలపల్లిలో ఎడ్లబండ్ల ఊరేగింపు

పెద్దశంకరంపేట, మే 23: పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లిలో దుర్గమ్మతల్లి జాతరలో భాగంగా ఎడ్లబండ్ల ఊరేగింపు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.



శివ్వంపేట బగళాముఖి ఆలయంలో మహామంత్ర హవనం

రంగనాయకస్వామి రథోత్సవం

కొల్చారం: కొల్చారం మండలం రంగంపేటలో రంగనాయకస్వామి రథోత్సవం గురువారం తెల్లవారుజామున కనులపండువగా జరిగింది. రంగనాయకస్వామి 688వ పంచాహ్నిక ఉత్సవాల్లో భాగంగా వారం రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి ఘట్టమైన రథోత్సవం గ్రామంలోని వీధులు గుండా కొనసాగింది.

ఘనంగా శ్రీలక్ష్మీ సుందరహోమం

వట్‌పల్లి: మండల పరిధిలోని దుద్దాల సర్వేశ్వరపురి క్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీలక్ష్మీ సుందరహోమంతో పాటు త్రినాథ వ్రతం ఆశ్రమ పీఠాధిపతి అంబికా శివమణియోగి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

బగళాముఖి ఆలయంలో మహామంత్ర హవనం

శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన శక్తిపీఠం బగళాముఖి అమ్మవారి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రధాన పూజారి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ట్రస్ట్ మెంబర్ శివకుమార్‌గౌడ్ భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.



పెద్దశంకరంపేట మండలం చీలపల్లిలో ఎడ్లబండ్ల ఊరేగింపు



సర్వేశ్వరపురి క్షేత్రంలో శ్రీత్రినాథ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

నిందితులను పట్టుకోరా?

- ఆలయాల్లో వరుస దొంగతనాలు
- చైన్ స్నాచింగ్‌కు విఫలయత్నాలు
- వ్యవసాయ సామగ్రిని సైతం వదలని దొంగలు
- నెలల నుంచి కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు
- భయపెడుతున్న వరుస దొంగతనాలు

కుకునూరుపల్లి, మే 23: గుడి, బడి, ఇల్లు, వ్యవసాయ భూములు అనే తేడా లేకుండా దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. గత 8 నెలల నుంచి సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. కానీ కేసులను చేదించడం, నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని స్థానిక ప్రజలు అంటున్నారు.

ఒకే రోజు రెండు ఆలయాల్లో చోరీలు

ఐదు నెలల క్రితం ఒకే రోజు లకుడారం, మెదినిపూర్ గ్రామాల్లోని దండు మైసమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో బంగారం, వెండి నగలుతో పాటు అధిక మొత్తంలో నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. ఒకే గుడిలో రెండు మూడు సార్లు దొంగతనం జరిగిన సంఘటనలున్నాయి. లకుడారం గ్రామంలోని దండు మైసమ్మ ఆలయంలోనే గత రెండు సంవత్సరాల్లో మూడుసార్లు దొంగతనాలు జరిగాయి. పి.టి వెంకటాపూర్ శివాలయంలో గుడిగంటలను దొంగిలించడానికి ప్రయత్నించిన దుండగుడు గ్రామస్థులకు చిక్కగా వారు దేహశుద్ధి చేసి వదిలిపెట్టారు. చిన్నకిష్టాపూర్ గ్రామంలోని పెద్దమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో కొంత నగదును ఎత్తుకెళ్లారు.

పుస్తెలతాళ్ల దొంగతనానికి యత్నం

ఒంటరి మహిళల మెడలో నుంచి పుస్తెలతాళ్లను లాక్కెళ్లేందుకు పలు మార్లు దుండగులు విఫలయత్నం చేశారు. ఏడు నెలల క్రితం మెదినిపూర్ పెట్రోల్‌బంక్ వద్ద రెండుసార్లు చైన్ స్నాచింగ్‌కి ప్రయత్నించారు. లకుడారం మదిర గ్రామమైన కోలోనిపంపుకు రాత్రి 8 గంటల సమయంలో బంధువుల ఇంటి వద్దకు బైక్‌పై వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును దొంగిలించడానికి ప్రయత్నించగా మహిళ దొంగ కదలికలను పసిగట్టడంతో పరారయ్యాడు. ఈ ఘటనలో బైక్ పైనుంచి మహిళతో పాటు బైక్ నడుపుతున్న వ్యక్తి కింద పడడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మరక ముందుకే 15 రోజుల వ్యవధిలో త పస్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును దొంగిలించడానికి ప్రయత్నించి మరోమారు దొంగలు విఫలమయ్యారు. నాలుగు నెలల క్రితం బొబ్బాయిపల్లిలో వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి వస్తున్న తూమ్ బాలమణి మెడలో నుంచి నాలుగు తులాల బంగారాన్ని బైక్‌పై వచ్చి లాక్కెళ్లారు. 15 రోజుల వ్యవధిలో కోనాయిపల్లికి చెందిన మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి దొంగలు విఫలమయ్యారు.



రెండుసార్లు వరుస దొంగతనాలు జరిగిన కుకునూరుపల్లి మండలం మేదినీపూర్ గ్రామంలోని పెద్దమ్మ ఆలయం(ఫైల్)

వ్యవసాయ సామగ్రినీ వదలరు..

గడిచిన సంవత్సరం నుంచి కుకునూపల్లి మండలంలోని వ్యవసాయ బావుల వద్ద ఉన్న సామగ్రిని దుండగులు ఎత్తుకెళ్లారు. బోరు పైపులు, బోరు మోటార్లు, కేబుల్‌వైర్లు, ఇతర వ్యవసాయ సామగ్రిని దొంగలించారు. పలు ఇళ్లల్లో కూడా సంవత్సర కాలంగా దొంగతనాలు జరిగాయి. మాత్‌పల్లి, కుకునూరుపల్లి, బొబ్బాయిపల్లి గ్రామాల్లో దొంగతనాలకు ప్రయత్నాలు జరిగాయి. కొన్నిళ్లలో నగదు, బంగారాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు.

కొనసాగుతున్న దర్యాప్తులు

ఆలయాలు, చైన్ స్నాచింగ్, పలు గ్రామాల్లో చోరీలు, వ్యవసాయ బోర్ల వద్ద దొంగతనాలు జరుగుతున్నప్పటికీ కేసులు మాత్రమే నమోదు అవుతున్నాయి. వాటిని పరిష్కరించడంలో పోలీసులు విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటివరకు ఒక్క కేసు దర్యాప్తు కూడా పూర్తి కాలేదు. ఒక్క నిందితుడిని కూడా పట్టుకున్న దాఖలాలు లేవు. వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎక్కడ ఎప్పుడు ఏ దొంగతనం జరుగుతుందో అని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెంచి నిందితులను పట్టుకోవాలని కోరుతున్నారు.

నిందితులను పట్టుకుంటాం

గత మూడు నెలల కాలం నుంచి 70 కేసులను ఛేదించాం. పాత కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి దర్యాప్తు చేస్తున్నాం. తప్పకుండా నిందితులను పట్టుకుంటాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– పి.శ్రీనివాస్, ఎస్‌ఐ, కుకునూరుపల్లి

పనులను పరిశీలించిన ఎంపీడీవో



పనుల్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంమోహన్

మద్దూరు, మే 23 : మండలంలోని లద్నూరులో ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులని ఎంపీడీవో ఎస్. రాంమోహన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న విద్యుత్ లైన్ పనులతో పాటు తరగతి గదుల్లో జరుతున్న ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు. ఈ నెల చివరికల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే హరితహారం నాటికి మొక్కల్ని సిద్ధ ఉంచాలన్నారు. ఉపాధిహామీ పనుల్ని పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజామొయినుద్దీన్, టీఏలు వెంకటమ్మ, శ్రీనివాస్ ఫీల్డు అసిస్టెంట్ పరుశురాములు ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

వర్గల్, మే 23: వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జహంగీర్ యాదవ్‌ను గురువారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి పరామర్శించారు. జహంగీర్‌కు ఇటీవల శస్త్ర చికిత్స జరగడంతో ఆయన ఆరోగ్యం పరిస్థితిని ఎమ్మెల్సీ అడిగి తెలుసుకున్నారు.

నత్తనడకన మినీ స్టేడియం పనులు

- శిలాఫలకానికే పరిమితమైన అభివృద్ధి
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

బెజ్జంకి, మే 23: గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడ నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రభుత్వం బృహత్తరంగా చేపట్టిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కోట్ల రూపాయలు అభివృద్ధికి కేటాయించినప్పటికీ పనులు చేపట్టకపోవడంతో శిలాఫలకానికే అభివృద్ధి పరిమితమైంది. గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు కూడా బోర్డులకే పరిమితమయ్యాయి తప్ప క్రీడాకారులు వసతులకు మాత్రం నోచుకోవడం లేదు.

29 నెలలుగా శిలాఫలకానికే పరిమితం

మండల కేంద్రంలో క్రీడాకారుల సౌలభ్యం కోసం ఏర్పాటుచేసిన మినీ స్టేడియానికి గత ప్రభుత్వంలో మంత్రి హరీశ్‌రావు 2022 జనవరిలో రూ, 1.50 కోట్లతో మినీ స్టేడియం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి 29 నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు స్టేడియం అభివృద్ధి పనులుముందుకు సాగడం లేదు. వాకింగ్, రన్నింగ్ ట్రాక్, క్రికెట్, వాలీబాల్ తోపాటు ఇతర క్రీడలకు అనువుగా ఉంటుందని స్టేడియం అభివృద్ధికి నిధులు కేటాయించారు. కానీ



ఆగిపోయిన బెజ్జంకి మినీ స్టేడియం పనులు

క్రీడాకారుల సౌలభ్యం కోసం నామమాత్రంగా పనులు చేపట్టినప్పటికీ, పూర్తిస్థాయిలో స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి రాలేదు.

బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు

గ్రామీణ ప్రాంతాల్లో వివిధ క్రీడల్లో యువతలో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో క్రీడ ప్రాంగణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 15 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. 15 గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల కోసం 44.69 లక్షలను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం కేటాయించింది. క్రీడా ప్రాంగణాల్లో వాలీబాల్ కోర్టు, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, ఎక్సర్సైజ్ బార్స్ ఏర్పాటు చేయాల్సి ఉన్నది. కానీ క్రీడా ప్రాంగణాల్లో వసతులు కనిపించక బోర్డులకే అవి పరిమితమయ్యాయి.

ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సంవత్సరాలు గడుస్తున్నా స్టేడియాన్ని ఎందుకు అభివృద్ధి చేయడం లేదో అర్థం కావడం లేదు. క్రీడాకారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్టేడియాన్ని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

-సంగెం మధు, బెజ్జంకి

వసతులను కల్పించాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించాలి. పూర్తిస్థాయిలో క్రీడా ప్రాంగణాలు క్రీడాకారులకు అందుబాటులోకి రావడం లేదు.

- పొన్నం ప్రవీణ్, గాగిల్లాపూర్

ఎట్టకేలకు వ్యర్థాల తొలగింపు



పెద్దకోడూరు శివారులో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు, మే 23: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను గ్రామ శివారుల్లో పారబోసి కాల్చివేస్తున్నారు. దీనిపై గురువారం ఆంధ్రజ్యోతిలో 'పేరుకే డంపింగ్ యార్డులు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి పెద్దకోడూరు గ్రామ శివారులో చెత్తను కాల్చి వేయగా మిగిలిన వ్యర్థాలను పంచాయతీ కార్యదర్శి రాజు డోజర్ సహాయంతో తొలగింపజేశారు. పంచాయతీ సిబ్బంది గ్రామ శివారులో చెత్త పారబోయకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఇల్లు వదిలి వెళ్లిపోయిన కుమారుడు, కోడలు

గజ్వేల్, మే 23: ఏ పనిచేయకుండా ఇంట్లోనే ఉంటున్నారని మందిలించినందుకు తన భార్యతో కలిసి కుమారుడు ఇళ్లు వదిలి వెళ్లిపోయిన సంఘటన గజ్వేల్ మండలం గిరిపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన నీల చంద్రయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. ఏడాది క్రితం కుమారుడు నీల గణేశ్(21)కు కుకునూరుపల్లి మండలం మేదినీపూర్‌కు చెందిన కల్యాణి(20)తో వివాహమైంది. నాటి నుంచి ఏ పనిచేయకుండా గణేశ్ ఇంట్లోనే ఉంటుండడంతో తండ్రి చంద్రయ్య మందలించాడు. దీంతో భార్య కల్యాణితో కలిసి ఈ నెల 5న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదరు. తల్లిదండ్రులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.సైదా తెలిపారు.

మహిళ అదృశ్యం

గజ్వేల్, మే 23: మహిళ అదృశ్యమైన సంఘటన గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన నాయకం లక్ష్మి(78) ఈ నెల 22న ఇంట్లో గొడవ జరగడంతో తల్లిగారి ఊరైన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం లాల్‌గడిమలక్‌పేటకు వెళ్తానని చెప్పి వెళ్లింది. రెండు రోజులైనా ఆమె తల్లి గారి ఇంటికి చేరకపోవడంతో బంధువులు, కుటుంబసభ్యులు గురువారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

ఎంఈవోకు పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, మే 22: అనారోగ్యంతో బాధపడుతూ, దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మిరుదొడ్డి ఎంఈవో ప్రభుదాస్‌ను గురువారం మిరుదొడ్డి మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు బాల్‌రాజు, నాయకులు లింగం, సత్యనారాయణ,భైరయ్య, జ్ఞానేశ్వర్, రాధకిషన్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట రూరల్/బెజ్జంకి,మే 23: విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, రాఘవాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పుల్లూరు, రాఘవాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బెజ్జంకి మండలంలో నేడు ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ మాణిక్యాలు, ఏఈ బాలకిషన్ తెలిపారు. కోహెడ మండలంలోని శనిగరం సబ్ స్టేషన్‌లో 132/33 కేవీ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

సమయానికి యూనిఫామ్‌లు అందించాలి

- డీఆర్డీవో జయదేవ్ ఆర్య



కుట్టు కేంద్రంలో యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీవో

బెజ్జంకి, మే 23: పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు యూనిఫామ్స్ అందించాలని డీఆర్డీవో జయదేవ్ ఆర్య ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేందుకు నిర్వహిస్తున్న మండల కేంద్రంలోని కుట్టు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. మండలంలోని 34 పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేందుకు ఎనిమిది కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. త్వరితగతిన యూనిఫామ్స్ కుట్టి అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం నరసయ్య, సూపరింటెండెంట్ అంజయ్య, సీసీలు పాల్గొన్నారు.

తెరుచుకోని అగ్రోస్ రైతు సేవా కేంద్రం



దౌల్తాబాద్ మండల కేంద్రంలో మూసి ఉన్న ఆగ్రోస్ కేంద్రం

దౌల్తాబాద్/కొండపాక,మే 23: మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం గురువారం తెరుచుకోలేదు. వానాకాలంలో జీలుగ, జనుము విత్తనాల కోసం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల వద్దకు ఆయా గ్రామాల రైతులు వచ్చి, కేంద్రం మూసి ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆగ్రోస్ దుకాణ యజమానికి ఫోన్ చేసి జీలుగ విత్తనాలు ఎప్పుడు వస్తాయని అడగడంతో 2 నుంచి మూడు రోజులు సమయం పడుతుందని ఆయన సమాధానం ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు. రైతులకు సరిపడా జీలుగ విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచి, జీలుగ సాగులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. భూసారాన్ని పెంపొందించే పచ్చి రొట్ట ఎరువులు జీలుగ, జనుము కొండపాకమండలంలో అంతంత మాత్రమే సరఫరా అయ్యాయి. ఎరువుల కొరత వల్ల రైతులు పడిగాపులు కాస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తుంది. మండలంలో వీటిని వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద ఉన్న ఆగ్రోస్ దుకాణంలో అందుబాటులో ఉంచారు. ఇక్కడ అరకొర సరఫరాతో నిలువలు ఉండడంతో కొరత ఏర్పడింది. ఆగ్రోస్ దుకాణానికి పంపిణీ చేసిన 150 బస్తాల జీలుగ, 25 బస్తాల జనుము పంపిణీ ప్రారంభించిన రెండు రోజుల్లోనే విక్రయించారు. మూడు రోజుల నుంచి విత్తనాల కోసం రైతులు తిరిగిపోతున్నారు.

గొల్లకురుమల ఆశలు ఆవిరి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 23: గొల్లకురుమల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆవిరి చేసిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. గొర్ల యూనిట్ల పంపిణీ పథకం ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సన్నగిల్లి పోతున్నదని, గత ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి ఒక్క యూనిట్ ద్వారా 21గొర్రెలను పంపిణీ చేసిందన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో గొల్ల కురుమలు డీడీలు కట్టి చాలా రోజులు గడుస్తున్నా వాళ్లకి ఇవ్వవలసిన గొర్ల యూనిట్లను పంపిణీ చేయడం లేదన్నారు. పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని గొల్ల, కుర్మలు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు.

చిటుకు వ్యాధి నివారణకు టీకాలు

మద్దూరు, మే 23: గొర్లమేకలు చిటుకవ్యాధి బారిన పడకుండా ఉండేందుకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వ్యాధి నివారణ చర్యలకు ఏర్పాటు చేసిన టీకాల కార్యక్రమాన్ని గొర్లమేకల పెంపకందార్లు సద్వినియోగం చేసుకోవాలని మద్దూరు పశువైద్యాధికారి హరికిషన్ తెలిపారు. మండల కేంద్రంలో వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించినట్లు తెలిపారు. తొలకరి వర్షాలకు మొలిచిన పచ్చిగడ్డి మేతతో గొర్లుమేకలు చిటుకువ్యాధి బారిన పడుతాయని. గొర్లమేకల పెంపకందార్లు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వీఎల్‌వో పర్వయ్య, వీఏ నవీన్, వోఎస్ రాజుతో పాటు పెంపకందార్లు పాల్గొన్నారు.

'బురదజల్లే ప్రయత్నం'

మిరుదొడ్డి, మే 23: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లె ప్రయత్నంచేస్తున్నారని కాంగ్రెస్ మిరుదొడ్డి మండల సీనియర్ నాయకుడు రాజు మండిపడ్డారు. మిరుదొడ్డిలో గురువారం ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం సరైన పద్ధతి కాదన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ విజయ్‌కుమార్

ములుగు, మే 23: మూఢనమ్మకాలు, సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి ములుగు మండలం బండమైలారంలో పోలీసుల ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలని, హెల్మెట్ దరించాలని సూచించారు.

కట్టారు.. వదిలేశారు..

- మందుబాబులకు అడ్డగా ఫంక్షన్‌హాల్
- ఇప్పటికైనా ప్రారంభించాలని వేడుకోలు

ములుగు, మే 23: గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు వివాహాలు చేసుకోవడం కోసం ఫంక్షన్‌హాల్స్ నిర్మాణం చేపట్టింది. ములుగు మండలంలోని ములుగు, అచ్చాయిపల్లి, బస్వాపూర్, అలీనగర్, బండమైలారం, బైలంపూర్, మామిడియాల, కొట్యాల గ్రామాల్లో ఫంక్షన్‌హాల్స్ నిర్మాణం చేపట్టారు. కోట్లాది రూపాయలతో నిర్మాణం చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ప్రారంభం కాలేదు. పేద ప్రజలు పెళ్లిలు, శుభకార్యాలు చేసుకోవాలంటే ప్రైవేటు ఫంక్షన్‌హాల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫంక్షన్‌హాల్‌లో అయితే తమకు ఎంతో కొంత లాభం జరుగుతుందని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం మండలంలో ఏర్పాటు చేసిన ఫంక్షన్‌హాల్స్ ప్రారంభించాలని గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.



ప్రారంభం కాని ములుగు ఫంక్షన్‌హాల్

అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా

గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఫంక్షన్‌హాల్స్‌ను ప్రారంభించకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అవి నిలయాలుగా మారాయి. యువకులు రాత్రి వేళ మద్యం సేవించి ఫంక్షన్‌హాల్స్‌ను నాశనం చేస్తున్నారు. ప్రతి ఫంక్షన్‌హాలు చుట్టూ ప్రహరి నిర్మించి ప్రారంభించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నారు.

రైతులను దోచుకుంటున్న మిల్లు యజమానులు

- తేమ, తాలు పేరుతో కోతలు
- సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రైతులు



సిబ్బందితో గొడవపడుతున్న రైతులు

కుకునూరుపల్లి, మే 23: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకుందామంటే రైస్‌మిల్లు సిబ్బంది తాలు, తేమ పేరుతో మోసం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన ముద్దపూర్ గ్రామంలోని ధనలక్ష్మి రైస్‌మిల్లులో గురువారం జరిగింది. తిప్పారం గ్రామంలో ప్రభుత్వం రైతుల నుంచి ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నది. ఈ ధాన్యాన్ని ముద్దాపూర్‌లోని ధనలక్ష్మి రైస్‌మిల్లు కొనుగోలు చేస్తున్నది. రైతులు తాలు పట్టకుండా రైస్ మిల్లు యాజమాన్యంతో 42.200 గ్రాముల కొనుగోలు చేయాలని రైతులు, మిల్లు యాజమాన్యం ఒప్పందం చేసుకున్నారు.

ఒప్పందానికి భిన్నంగా..

రైస్‌మిల్లు సిబ్బంది మాత్రం ప్రతి లారీలోడుకు తాలు, తేమ అధికంగా ఉందని కుంటి సాకులు చెబుతూ మరో 500 గ్రాముల ధాన్యాన్ని అధికంగా ఇస్తేనే తీసుకుంటామని, అలాగైతేనే లోడ్ దించుకుంటామని లేకపోతే మీ ఇష్టం అని రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ప్రతి రోజు ఇలాంటి ఘటనలు సర్వసాధారణంగా మారడంతో విసుగు చెందిన తిప్పారం గ్రామ రైతులు బుధవారం రైస్‌మిల్లు వద్దకు వెళ్లి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాలు పట్టకుండా 42.200 గ్రాములు ఇస్తున్నామని, 45 డిగ్రీల ఎండలో ఎండిన వడ్లను తేమ పేరుతో తిరస్కరిస్తున్నారని, ధాన్యం శాంపిల్‌ను సంచి మధ్యలో నుంచి కాకుండా ఎగువ, దిగువ నుంచి తీస్తున్నారుని తెలిపారు. ఔటర్ పేరుతో ప్రతిసారి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, యజమానులు అడిగినా దానికంటే 200 గ్రాములు ప్రతి సంచికి ఎక్కువగా ఇస్తున్నామని, అయినప్పటికీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడికి చేరుకున్న రైస్‌మిల్లు యజమానులు రైతులను శాంతింపచేసి మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.



తాలు పట్టకుండానే 42.200 గ్రాములు ప్రతి సంచికి ధాన్యాన్ని ఇస్తున్నాం. అయినప్పటికీ మిల్లు సిబ్బంది తేమ, ఔటర్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సిబ్బంది ఇదే విధంగా వ్యవహరిస్తున్నారు.

- గడ్డం మల్లేశం రైతు, తిప్పారం

తీన్మార్ మల్లన్న తరఫున ప్రచారం



చేర్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, మే 23: వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తరఫున కాంగ్రెస్ చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్ము రవి గురువారం చేర్యాల మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి ఇస్తామని బీఆర్ఎస్ ఏళ్లతరబడి వంచించిందన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి పరీక్షా పత్రాల లీకేజీలకు పాల్పడి లక్షలాదిమంది యువత జీవితాలతో చెలగాటమాడిందన్నారు. ఆయనవెంట నాయకులు ఆది శ్రీనివాస్, ముస్త్యాల యాదగిరి, తాళ్లపల్లి వెంకటేశ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వర్గల్ కాంగ్రెస్ నాయకులు

వర్గల్, మే 23: రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని వర్గల్ మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్ మినిస్టర్ క్వాటర్స్‌లో కలిసి మంత్రికి పుష్పగుచ్చాలు అందజేస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ నాయకులు సల్మాన్, మహబూబ్, నందకుమార్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీ



ధ్వంసమైన నీటి పైప్

చేర్యాల, మే 23: చేర్యాల పట్టణంలోని వైశ్యభవన్ శివాలయ ఆవరణలోని మినీ వాటర్ సిస్టర్న్ నుంచి పలు ఆవాసాలకు నీటిని మళ్లించేందుకు, డ్రైనేజీ కాలువ వెంబడి ఏర్పాటుచేసిన పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. పలు ప్రదేశాలలో ధ్వంసమై పాకురుపట్టడంతో పరిసరాలన్నీ విహీనంగా దర్శనమిస్తున్నా మునిసిపల్ కార్యాలయ సిబ్బంది చోద్యం చోడడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి తాగు నీరు కలుషితంకాకుండా ప్రత్యామ్నాయచర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

ధూళిమిట్ట, మే 23: రెవెన్యూ అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి మంగళవారం జాలపల్లి గ్రామ శివారులో ఏలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 25 ట్రాక్టర్ల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇసుకను నేడు ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు ధూళిమిట్ట తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యామ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం వేలం వేయాల్సి ఉన్నప్పటికీ ఎవరు రాకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేసినట్లు వెల్లడించారు. ఆసక్తి గలవారు రూ. 5000 డిపాజిట్ చెల్లించి, వేలం పాటలో పాల్గొనాలన్నారు.


నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు

నంగునూరు/మద్దూరు, మే 23: ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నేటి నుంచి జరగనున్నాయని నంగునూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ తెలిపారు. నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 24 మంది, అక్కెనపల్లి మోడల్ స్కూల్ నుంచి 21 మంది, నర్మెట కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయం నుంచి 12 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నంగునూరు నుంచి ఐదుగురు, అక్కెనెపల్లి మోడల్ స్కూల్ నుంచి ఒకరు చొప్పున విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ద్వితీయ సంవత్సరము విద్యార్థులు మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి 31 వరకు ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రాజ్ తెలిపారు. మొత్తం 179 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరానికి, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటలకు ద్వితీయ సంవత్సరానికి పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

ఘనంగా బుద్ధుని జయంతి

హుస్నాబాద్, మే 23: హుస్నాబాద్ పట్టణంలోని విద్యావాణి స్కూల్‌లో గురువారం బుద్ధుని 2,568వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, సామాజిక విశ్లేషకులు వడ్డెపల్లి మల్లేశం, ఇల్లెందుల లక్ష్మన్, పొన్నాల ఫ్రాన్సిస్, నాంపల్లి సమ్మయ్య తదితరులున్నారు.

'కాలువలను శుభ్రంగా ఉంచాలి'



పట్టణంలో స్త్రాం వాటర్ డ్రైన్లను పరిశీలిస్తున్న కమిషనర్

గజ్వేల్, మే 23: వర్షాకాలం దృష్ట్యా మురికికాలువలను శుభ్రంగా ఉంచాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని పలు మురికి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా పిడిచెడ్ రోడ్డులోని మురికికాలువలు శుభ్రం చేయించారు. ఆయనవెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఏఈఈ కిష్టన్న, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.

వరదరాజపూర్‌లో ఘనంగా బండ్ల ఊరేగింపు



హుస్నాబాద్: ఎల్లమ్మ దేవికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

మర్కుక్, మే 23: మండల పరిధిలోని వరదరాజపూర్‌లో వరదరాజుల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం భూనీళా సమేత వరదరాజుల స్వామి గరుడసేవ, సాయంత్రం వరదరాజుల స్వామి ఆలయం నుంచి అంజనేయస్వామి ఆలయం వరకు బండ్ల ఊరేగింపు వరదరాజపూర్, ఎర్రవల్లి గ్రామస్థులు కన్నులపండుగగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్‌కృష్ణ, మండల కోఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహెరా నరేశ్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ అప్పాల ప్రవీణ్‌కుమార్, ఎర్రవల్లి ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, ఎర్రవల్లి తాజా మాజీ సర్పంచ్ భాగ్య బిక్షపతి, ప్యాక్స్ వైస్ చైర్మన్ బాలరాజు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కోహెడ : శనిగరం గ్రామంలోని ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీరంగం సంతోష్, పరకుసం వంశీ పంతులు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ కర్ర జయశ్రీ రవీందర్ చేతుల మీదుగా పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణాన్ని జరిపారు.



కోహెడ: శనిగరంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వైద్యం వికటించి బాలింత మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- గజ్వేల్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో మృతదేహాన్ని ఉంచి ఆందోళన

గజ్వేల్, మే 23: వైద్యం వికటించి బాలింత మృతిచెందిన సంఘటన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో గురువారం చోటుచేసుకుంది. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లికి చెందిన జక్కుల భవానికి మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రామాయంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రాజ్‌కు ఇచ్చి గతేడాది వివాహం చేశారు. భవాని గర్భం దాల్చడంతో గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించారు. ఈ క్రమంలో డెలీవరీకి మే 22న గడువు ఇవ్వడంతో బుధవారం రాత్రి 10గంటల సమయంలో తాము వచ్చామని భర్త లక్ష్మణ్ రాజు తెలిపారు. అన్ని పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉదయం 7గంటలకు డెలివరీ చేయగా జన్మించిన మగబిడ్డతో పాటు భవాని క్షేమంగా ఉన్నారని వైద్యురాలు చెప్పారన్నారు. అనంతరం 8గంటల సమయంలో భవానికి మళ్లీ విపరీతమైన నొప్పులు రావడంతో 8.30గంటల సమయంలో వైద్యురాలు మరోసారి లేబర్ రూమ్‌కు తీసుకెళ్లి పరీక్షించి, ఏం ప్రమాదం లేదని చెప్పారని వివరించారు. అనంతరం మరోసారి 11.00గంటలకు నొప్పులు ఎక్కువ కావడంతో తమకు సమాచారం ఇవ్వకుండా గర్భసంచిని తొలగించినట్లు వైద్యురాలు చెప్పారని మృతురాలి భర్త తెలిపారు. ఆ తర్వాత కూడా మరోసారి నొప్పులు తీవ్రం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నదని హైదరాబాద్‌కు తరలించాలని చెప్పారన్నారు. వెంటనే వైద్యురాలిని తీసుకుని కొంపల్లిలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. దీంతో సదరు ప్రైవేటు ఆసుపత్రిలో మృతదేహాన్ని ఉంచి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, సీఐ సైదా, లతీఫ్, ఎస్ఐ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కుటుంబసభ్యులు ఆందోళన విరమించలేదు. ఇదిలా ఉండగా తాను అన్ని విషయాలు కుటుంబ సభ్యులకు చెప్పే చేశానని వైద్యురాలు పోలీసులతో చెప్పినట్లు తెలిసింది.



భవాని మృతదేహం